కాలనీలకు దీటుగా బస్తీలలో అభివృద్ధి పనులు


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాలనీలకు దీటుగా బస్తీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. తమతమ బస్తీలలో అభివృద్ధి పనులు పూర్తి అయిన సందర్భంగా లంగర్‌హౌస్, నానల్‌నగర్ డివిజన్ల నుంచి పలువురు శనివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో తాను ఎప్పుడు బస్తీల పట్ల పక్షపాతం చూపించలేదన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో పర్యటించి తాను అక్కడి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించానని అన్నారు. మజ్లిస్ పార్టీకి ఉన్న ఆదరణను చూసి కొందరు మజ్లిస్ పార్టీ ఒక వర్గం ప్రజల కొమ్ము కాసే పార్టీగా ఆరోపిస్తున్నారన్నారు. అయితే ఇవి పసలేని ఆరోపణలని మజ్లిస్ పక్కా సెక్యులర్ పార్టీ అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గాంధీబొమ్మ పక్క వీధిలో శనివారం ఆమె నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టామని..ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీలోని ప్రజలు మురుగునీటి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తాను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2 లక్షలు మంజూరు చేయడంతో సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, నాయకులు పి.రాజేశ్వర్ రావు, ఎం.వెంకటేశ్, ఇ.సాయి సందీప్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- 19వ తేదీ నుంచి దాయిబాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు
- 22న స్వామివారి కల్యాణం
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు


ముస్తాబైన ఆలయం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమయ్యింది. ఆగస్టు 19న ప్రారంభమయ్యే 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23న ముగుస్తాయి. ఇందుకు హనుమాన్ బాలాజీ మందిరం ట్రస్టు కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయానికి సర్వాంగ సుందరంగా అలంకరించారు.

200 ఏళ్ల చరిత్ర..

200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 3వ నిజాం అస్సద్ జాహీ మీర్ అక్బర్ అలీఖాన్ సికిందర్‌జా కొలువులో రాజా చందులాల్ కీలక పదవులు నిర్వహించారు. గోల్కొండ కోట నుంచి ఆసిఫ్‌నగర్ మీదుగా (దాయిబాగ్) వెళ్తుండగా శ్రీవారు దర్శనం ఇచ్చారని, ఆ తర్వాత చందులాల్ దివాన్‌గా పదోన్నతి పొందారని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. వేంకటేశ్వర స్వామి కనిపించిన చోట 1810లో చందులాల్ భవ్యమైన ఆలయ నిర్మాణం చేపట్టాడని చరిత్ర చెబుతోంది. పెద్ద మొత్తంలో స్థలాన్ని కేటాయించి, పరిరక్షణ కోసం దాయి (సేవకురాలు)ని నియమించినట్లు తెలుస్తోంది. ఆలయానికి కేటాయించిన స్థలంలో రకరకాల పూల మొక్కలను పెంచి స్వామికి సమర్పించేవారని, దీంతో ఈ ప్రాంతానికి దాయిబాగ్ (సేవకురాలి తోట)గా పేరు వచ్చింది. దాదాపు 40 అడుగుల ఎత్తులో ఆలయ గర్భగుడి, 30 అడుగుల ఎత్తులో గాలిగోపురం నిర్మించారు. వీటిపై శిల్పకళ ఉట్టిపడుతుంది. శ్రీవారి ఆలయంతో పాటు శివాలయం, నవగ్రహ ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాలు కూడా ఈ ప్రాంగణంలో ఉన్నాయి.

ఆలయానికి ప్రముఖులు..

వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్య సభ సభ్యులు ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, బీఆర్ఎస్ నాంపల్లి ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రముఖ సంఘసేవకులు విద్యాసాగర్, మహేష్‌బ్యాంక్ చైర్మన్ రమేష్‌కుమార్ బంగ్ తదితరులు హాజరు కానున్నారు.

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేస్తున్నారు.
– సత్యంచారి, టస్టు అధ్యక్షుడు

ప్రతి ఒక్కరూ సేవలందిస్తారు..



బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఉత్సవాన్ని నిర్వహించే ఐదు రోజుల పాటు వ్యాపారాలు, ఉద్యోగాలకు సెలవు పెట్టి శ్రీనివాసుని సేవలోనే తరిస్తారు. అంతేకాకుండా ఉత్సవాల సమయంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సేవలందిస్తారు.
– శ్రీనివాస్, బ్రహ్మోత్సవాల కమిటీ అధ్యక్షుడు

ఉపాధి కల్పనకు మజ్లిస్ కృషి


జాబ్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

గోల్కొండ: యువతకు ఉపాధి కల్పించడం కోసం మజ్లిస్ ఎంతగానో కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం మెహిదీపట్నం రాయల్ రిజెన్సీ ఫంక్షన్ హాల్‌లో మజ్లిస ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్ నిర్వహించడం ఈ సంవత్సరం రెండోసారి అని అన్నారు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో మన దేశపు పెద్ద కంపెనీలన్నీ పాల్గొన్నాయన్నారు. ఈ సారి తాము యువతకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. ఇటువంటి జాబ్ ఫెయిర్‌లు మును ముందు కూడా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

యాకుత్‌పురా: విద్యార్థులు తమ మేధస్సును పెంపొందించుకునేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన మేరాజ్ సూచించారు. తలాబ్‌కట్టాలోని ఆరేబియా అన్వర్ ఉల్ ఉలుమ్–ఇ–మదర్సాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మదర్స నిర్వాహకులతో కలిసి విద్యార్థులకు తేనే బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు మేధస్సును మెరుగుపర్చే తేనేను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు మౌలాన సయ్యద్ షా నేమతుల్లా ఖాద్రీ, మహ్మద్ బీలాల్ ఖాద్రీ నిజామీ, మహ్మద్ అజ్మత్ ఖాద్రీ నిజామీ పాల్గొన్నారు.


విద్యార్థులకు తేనే బాటిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

గోవధ నిషేధ చట్టానికి ప్రత్యేక కృషి


ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావును సత్కరిస్తున్న గో భక్తులు

అఫ్జల్‌గంజ్: గోవధ నిషేధ చట్టం అమలయ్యే విధంగా బజరంగ్‌సేనా ప్రత్యేక కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర బజరంగ్‌సేనా అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. తెలంగాణతో పాటు అన్ని ప్రాంతాల్లో గోవధ నిషేధం పూర్తిగా అమలు కావాలన్నారు. బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో గోవధ ఎక్కడ జరిగినా అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. జైపూర్‌లో జరిగిన గోవధ నిషేధ అమలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..హిందూ సంస్కృతి సంప్రదాయాలను అన్ని ప్రాంతాల్లో చాటే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు అశోక్‌శర్మ, అశోక్ గంజ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించాలి


మాట్లాడుతున్న మౌలానా కారి సయ్యద్ మతీన్ అలీషాఖాద్రీ

గోల్కొండ: చిన్నతనం నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించాలని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు, మదర్సా దారుల్ ఉలూమ్ మదర్సా వ్యవస్థాపకుడు మౌలానా కారి సయ్యద్ మతీన్ అలీషాఖాద్రీ అన్నారు. శనివారం రిసాలబజార్‌లోని హుస్సేనీనగర్‌లో గల దారుల్ ఉలూమ్ మదర్సాలో జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో వేలాదిగా భర్తీ కాని కొలువులు ఉన్నాయని తెలుగు వచ్చిన వారికి ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. నేడు ఇంగ్లిష్ భాష గ్లోబల్ భాషగా గుర్తింపు పొందిందని ఇంగ్లిష్‌లో పట్టు ఉన్న వారు ప్రపంచంలో ఏ మూల వెళ్లిన ఉద్యోగాలు చేసుకోవచ్చునని అన్నారు. అనంతరం ఆయన సాఫెర్ పాషా ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థనలు చేశారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న డీసీపీ స్నేహా మెహ్రా

చార్మినార్: భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా స్థానిక వ్యాపారులకు సూచించారు. శనివారం రాత్రి చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్‌తో కలిసి పటేల్ మార్కెట్‌లోని హైదరాబాద్ కట్ పీస్ అండ్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సంఘవిద్రోహ శక్తుల కదలికలు, ట్రాఫిక్ సమస్యలు, శాంతి భద్రతల సమస్యలు ఏవైనా తలెత్తినప్పుడు సీసీ కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారులతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాయిబాబాచారికి సన్మానం



గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం గోల్కొండ కోట బోనాలకు ప్రపంచ గుర్తింపు లభించిందని గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. 14 ఏళ్ల వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా ఉంటూ వృత్తిపని వారి అభివృద్ధికి కృషి చేసిన సందర్భంగా శనివారం ఆయనను గోల్కొండలో సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్ల క్రితం వరకు వృత్తి పని వారంటే పలువురు నాయకులతో పాటు ఉత్సవ కమిటీ వారు చిన్న చూపు చూసేవారన్నారు. దేవాదాయ శాఖ అధికారుల సహాయ సహకారాలతో వృత్తిపని వారికి సరైన గౌరవం లభించిందన్నారు. ఆలయ పూజారి సురేష్‌చారి, శివకుమార్, వెంకటేష్, శ్రీకాంత్‌చారి, డింకు, వాణిశ్రీ, సుజాత ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ప్రవీణ్ బాగ్డీ



చార్మినార్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సుల్తాన్‌షాహీకి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు ప్రవీణ్ బాగ్డీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే టి.ఉమామహేంద్ర శనివారం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రవీణ్ బాగ్డీ 4వ సారి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పలువురు యువతీ యువకులను పార్టీ వైపు ఆకర్షింప చేయడంలో ఆయన కీలక పాత్ర వహిస్తున్నారన్నారు.

నియామకం


చంద్రశేఖర్


చాంద్రాయణగుట్ట: బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాదరి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాదరి చంద్రశేఖర్ మాట్లాడుతూ..భారతీయ జనతా పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ ఎంతో బలంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచే కార్యకర్తలు బూత్ స్థాయిలో పని చేయాలన్నారు. తనను ఈ పదవిలో నియమించినందుకు ఆయన పార్టీ అధినాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం కూచిపూడి కళాక్షేత్రం 2వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్యగురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు మాట్లాడుతూ..శాస్త్రీయ సాంప్రదాయ నృత్య కళలు కాపాడుకోవాలని అందుకు ఇలాంటి శిక్షణా సంస్థలు పూనుకోవాలని కోరారు. చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలను శాస్త్రీయ సంగీత కళల పట్ల ప్రోత్సయించాలని సూచించారు. అందుకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్యగురువు చింత శివ ఆదినారా, ఇందుమతి, సంస్థ వ్యవస్థాపకురాలు వసుధ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



గోల్కొండ/జియాగూడ: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తామని కార్వాన్ శివశంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పడాల అనంతకృష్ణ అన్నారు. కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో శివశంకర క్రాంతి సేవా సమితి వారు విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..78వ స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతకాన్ని ఎరగవేయాలని పిలుపునిచ్చారన్నారు. శివశంకర్ క్రాంతి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'కళావీర' ఆర్ట్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న శృతి పాటిల్

బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియం వేదికగా 'కళావీర' కళా ప్రదర్శన శనివారం పత్రికా సమాచార కార్యాలయం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాంప్రదాయ ఎగ్జిబిషన్‌కు భిన్నంగా చీరలు, షాలు, టైలు, చొక్కాలు, నవతరం లుంగీలు వంటి ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజల వ్యక్తీకరణలు, భావనలను ఒక కళాకారుడు, భిన్న ఉత్పత్తులపై గీయడం చాలా ప్రత్యేకమైన అంశం అన్నారు. ఈ ఉత్పత్తులను కనుగొనడం చాలా అరుదు అని కళావీర ప్రదర్శనలో మధ్యప్రదేశ్, అస్సాం, తదితర ప్రాంతాలకు చెందిన వివిధ గిరిజన కళారూపాలను వివిధ రకాల వస్త్రాలపై చిత్రీకరించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిత్రకారిణి శిఖా అజ్మీరా మాట్లాడుతూ..దుస్తులు, ఇతర వస్తువులు, సరుకులకు జీవం పోసేలా కారిగరి ఆఫ్ కలర్స్‌ని ఉపయోగించామన్నారు. శిఖా అజ్మీరా ప్రముఖ కళాకారిణి, పారిశ్రామికవేత్త, దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న జాతీయ అవార్డు పొందిన కళాకారులకు సహకారం అందించడంపై ఆమె దృష్టి సారిస్తున్నారు. కళావీర ఆర్ట్ ఎగ్జిబిషన్ హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో ఆగస్టు 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

యాదవుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి


అఖిలేష్‌ను సత్కరిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: యాదవ కులస్తుల సంక్షేమానికి బీఆర్ఎస్ ముందుంటుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పదేళ్లపాటు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యాదవులకు అన్నివిధాల సంక్షేమ పథకాలు అందాయన్నారు. న్యూ ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా యాదవ మహాసభ సమావేశంలో శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..యాదవుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఓబీసీలో 28 బీసీ కులాలను చేర్చాలి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మెమోరాండం అందజేస్తున్న వెన్న ఈశ్వరప్ప

అబిడ్స్: తెలంగాణలో 28 బీసీ కులాలను కేంద్ర ఓబీసీలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ..28 బీసీ కులాలను కేంద్ర ఓబీసీలో చేరిస్తే బీసీ కులాల అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా జాతీయ బీజేపీ నాయకులు బీఎల్ సంతోష్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్.కృష్ణయ్యకు మెమోరాండం అందజేసినట్లు తెలిపారు.

అలరించిన 'నెల నెలా కళారాధన'



నాంపల్లి: సాంస్కృతిక వారసత్వం పరిరక్షణలో భాగంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిని సంస్థ, శ్రీ రాధిక మ్యూజిక్అండ్ డ్యాన్స్ అకాడమీ సంస్థల సంయుక్త నిర్వహణలో శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 'నెల నెలా కళారాధన'29వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా పద్మశ్రీ డి.ఉమా మహేశ్వరి, కథక్ కళాక్షేత్ర సంచాలకులు, గురువు డాక్టర్ శ్రీ అంజిబాబు, యువ కళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, నృత్య గురువు కళాకృష్ణ హాజరయ్యారు. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను సత్కరించారు.

చెరువుల పరిశుభ్రతకు కృషి



సాక్షి, సిటీబ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, జీహెచ్ఎంసీ సంయుక్తంగా జంట నగరాల్లో క్లీన్ అండ్ గ్రీన్ చెరువుల కోసం కృషి చేస్తున్నాయని క్లబ్ అధ్యక్షుడు బీకే. రెడ్డి అన్నారు. శనివారం లంగర్ హౌస్ తలాబ్ వద్ద 30 మంది వలంటీర్లతో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ అనేది రోటరీ ఇంటర్నేషనల్ ప్రాధాన్యత కలిగిన 7 రంగాల్లో ఒకటి అన్నారు. ఇందులో భాగంగా నగరంలోని చెరువుల ప్రక్షాళనకు కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆర్‌టీఎస్ మూర్తి వాడపల్లి, ఆర్‌టీఎస్ నాగరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



చార్మినార్: క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలుండవని సీనియర్ వైద్యులు డాక్టర్ అమ్తుల్ హసీబ్ హమైరా అన్నారు. శనివారం చంచల్‌గూడ యునానీ డిస్పెన్సరీ ఆధ్వర్యంలో ఆయుష్ వయోవృద్ధుల వైద్య శిబిరం జరిగింది. జిరియాటిక్ వైద్య శిబిరంలో డబీర్‌పురా, ఉస్మాన్‌పురా, చంచల్‌గూడా, పిల్లిగుడిసెలు, చంచల్‌గూడ, మలక్‌పేట్ తదితర ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజెన్స్ పాల్గొని వైద్య సేవలు పొందారు. ఆమె మాట్లాడుతూ.. వయో వృద్ధులు రెగ్యులర్‌గా యోగా చేస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకు మందులు వాడాలన్నారు. ఆయుష్ హైదరాబాద్ ప్రోగ్రాం అధికారి వి.శ్రావన్‌కుమార్, ఆయుష్ ఫార్మసిస్ట్ సాజిద్ అహ్మద్, మహ్మద్ ఉమర్ షరీఫ్ పాల్గొన్నారు.

భార్యను కత్తితో పొడిచి హత్య


అస్మాబేగం(ఫైల్)

నాంపల్లి: అనుమానంతో భార్యను భర్త కత్తితో పొడిచి చంపిన ఘటన నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ బ్యాట్రీలేన్ లక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం..స్థానికంగా నివాసం ఉండే హసన్, అస్మాబేగం(40) భార్యాభర్తలు. 14 ఏళ్ల కింద వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏడాదిగా వీరిద్దరి మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. భార్య అస్మాబేగం కాంగ్రెస్ సీనియర్ నేత మహ్మద్ ఫిరోజ్ ఖాన్ ఇంట్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం ఫిరోజ్‌ఖాన్ ఇంటికి పనికి వెళ్తుండగా మార్గమధ్యలో భార్యను భర్త కత్తితో పొడిచి చెత్తకుండీలో వేసి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్తుడికి నెల రోజుల జైలు

గౌలిపురా: రాడ్, స్క్రూ డ్రైవర్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ పాత నేరస్తుడికి నెల రోజుల జైలు శిక్ష పడింది. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ఆమన్‌నగర్–బి ప్రాంతానికి చెందిన ఏసీ టెక్నీషియన్ మహ్మద్ ఇర్ఫాన్ సోహేల్ (27) స్టేషన్ పరిధిలో పాత నేరస్తుడు. కాగా స్టేషన్ పరిధిలో రాడ్, స్క్రూ డ్రైవర్‌తో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన 4వ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాంద్రాయణగుట్ట: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3.25 లక్షల విలువజేసే 14 టన్నుల బియ్యం, 15 క్వింటాళ్ల గోదుమలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ..ఘాజీమిల్లత్ కాలనీకి చెందిన మహ్మద్ రిజ్వాన్ కారు డ్రైవర్. సులభంగా డబ్బులు సంపాదించేందుకు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి బయటి మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం పన్నాడు. ఇందుకోసం ఉప్పుగూడకు చెందిన రజనీకాంత్(42), వి.రాజేశ్వర్(44)ల సాయం తీసుకున్నాడు. ఇలా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తూ బయటి రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధమవుతుండగా టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, చాంద్రాయణగుట్ట పోలీసులు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రేషన్ బియ్యం, గోదుమలు స్వాధీనం చేసుకున్నారు. చాచా, కిరణ్, ఫక్రూ, సాయి అనే నిందితులు పరారీలో ఉన్నారు.

మాణిక్ ప్రభుగౌడ్‌కు రాజీవ్‌గాంధీ లెజెండరీ అవార్డు



యాకుత్‌పురా: న్యాయవాద వృత్తిలో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ న్యాయవాది, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో కన్వీనర్ మాణిక్ ప్రభుగౌడ్‌కు రాజీవ్ గాంధీ లెజెండరీ అవార్డు–2024 లభించింది. పాతబస్తీకి చెందిన మాణిక్ ప్రభుగౌడ్ హైకోర్టు, సిటీ సివిల్ కోర్టు, క్రిమినల్ కోర్టులలో న్యాయవాదిగా అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్ర భారతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆయనకు అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు.